

ఆదివారం ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 38.0°C | కనిష్ఠం : 24.5°C

స్కూళ్లు జిగేల్



కేసముద్రం, ఏప్రిల్ 14 : జిల్లాలోని బడులకు సౌర సొబగులు అందించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. పలు పాఠశాలల్లో సౌరశక్తి ద్వారా సోలార్ పవర్‌ను అందించేం దుకు తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీఎస్ రెడ్కో) ఏర్పాట్లు చేస్తోంది. సర్కార్ స్కూళ్లల్లో సౌరశక్తిని ఉపయోగించుకొని, నిరంతరం కరంట్ సరఫరా అందించడంతో పాటు బిల్లుల భారాన్ని తొలగించేందుకు సోలార్ విద్యుత్ వ్యవస్థల ను ఏర్పాటు చేస్తున్నారు. సౌరశక్తి ద్వారా వచ్చే కరెంట్‌తో పాఠశాలల్లో విద్యుత్ బిల్లుల కష్టాలు తీరనున్నాయి.

మహబూబాబాద్ జిల్లాలో మొత్తం 898 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 676 ప్రాథమిక, 120 ప్రాథమికోన్నత, 102 ఉన్నత పాఠశాలలున్నాయి. కాగా, 151 బడుల్లో సోలార్ పవర్ సిస్టంలను ఏర్పాటు చేశారు. ఇందులో 40 ప్రాథమిక పాఠశాలలుండగా 23 ప్రాథమికోన్నత, 88 హైస్కూళ్లలో సౌర విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. 136 పాఠశాలల్లో ఏడాది క్రితమే సోలార్ పవర్ యూనిట్లను బిగించగా, కొద్దినెలలుగా మిగతా పాఠశాలల్లో ఈ యూనిట్లను బిగించే కార్యక్రమం కొనసాగుతోంది. తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీఎస్ రెడ్కో) ఆధ్వర్యంలో సోలార్ పవర్ సిస్టంలను పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో విద్యుత్ బిల్లులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడు తున్న దాఖలాలు లేకపోలేదు. ఈ క్రమంలో సోలార్ విద్యుత్ యూనిట్ల ఏర్పాటుతో ఈ ఇబ్బందులన్నీ తొలగిపోనున్నాయి.

బహుళ ప్రయోజనాలు..

పాఠశాలల్లో సౌరశక్తిని ఉపయోగించి విద్యుత్ ఉత్పత్తి వ్యవస్థల ఏర్పాటు ద్వారా బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. ఇతర సహజ వనరులను ఉపయోగించకుండా సూర్యుని శక్తి నుంచే విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం ఇందులో ప్రధాన ప్రయోజనం. సాధారణంగా విద్యుత్‌ను థర్మల్, అణు, జల విద్యుత్‌లలో బొగ్గు, నీరు, తదితర ఇంధనాలను ఉపయోగించాల్సిఉంటుంది. సోలార్ పవర్‌లో ఎలాంటి ఇంధనం ఉపయోగించకుండానే విద్యుత్ లభిస్తుంది. పాఠశాలల్లో సౌరశక్తిని ఉపయోగించడంవల్ల పర్యావరణ స్పృహతో కూడిన అభ్యాసాలను విద్యార్థుల్లో ప్రోత్సహించినట్లవుతుంది. కాలుష్యం లేకుండా గ్లోబల్ వార్మింగ్ ప్రభావాలను అరికట్టగల సామర్థ్యంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యక్ష ఉదాహరణగా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానళ్లు నిలుస్తున్నాయి.

పెరుగుతున్న విద్యుత్ బిల్లుల భారం తగ్గించడమేకాకుండా మిగులు విద్యుత్‌ను విక్రయించే అవకాశం కూడా ఉంది. సోలార్ ప్యానళ్ల ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను పాఠశాల అవసరాలకు వినియోగించగా మిగిలిన విద్యుత్‌ను పవర్ గ్రిడ్‌కు బదిలీ(విక్రయం) చేస్తారు. విద్యుత్ గ్రిడ్ ద్వారా ప్రజలకు సరఫరా చేస్తారు. ఇలా విక్రయించిన విద్యుత్‌కు యూనిట్ల వారీగా లెక్కించి పాఠశాలకే తిరిగి విద్యుత్ సంస్థలు డబ్బులు చెల్లిస్తాయి. తద్వారా విద్యుత్ విక్రయంతో పాఠశాలలకు ఆదాయం సమకూరి నిర్వహణ ఖర్చులకు చేదోడువాదోడుగా ఉంటుంది. అంతే కాకుండా పాఠశాలల్లో నూతనంగా అమలు చేస్తున్న డిజిటల్ క్లాస్‌లలో భాగంగా ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్‌లకు నిరంతర విద్యుత్‌ను అందించి తరగతులను ఆటంకం లేకుండా నిర్వహించే వీలుంది.

- సోలార్ పవర్‌తో బడులకు తగ్గనున్న కరెంట్ బిల్లుల భారం
- మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయంతో ఆదాయం
- డిజిటల్ తరగతుల బోధనకు ఊతం
- జిల్లా వ్యాప్తంగా 151 బడుల్లో ఏర్పాటు

పాఠశాలలకు 'సౌరశక్తి'



ఇనుగుర్తి హైస్కూల్లో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానళ్లు

ఉన్నత పాఠశాలలకు 2 కిలోవాట్స్..

సోలార్ పవర్ యూనిట్లు పాఠశాలల స్థాయిని బట్టి వాటి సామర్థ్యాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలకు 2 కిలోవాట్ల సామర్థ్యం ఉన్న సోలార్ పవర్ యూనిట్లను ఏర్పాటు చేశారు. ప్రాథమిక పాఠశాలలకైతే 1 కిలోవాట్ ఉత్పత్తి చేసే సౌర విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. గత ఏడాది 'మన ఊరు-మన బడి' కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 136 ప్రభుత్వ పాఠశాలల్లో సౌర విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేశారు. తొలిదశలో 250 మందికిపైగా విద్యార్థులున్న ప్రభుత్వ పాఠశాలలకు ప్రాధాన్యతనిచ్చారు. అయా పాఠశాలల్లో 2 కిలోవాట్ల సోలార్ విద్యుత్ ఉత్ప త్తి యూనిట్ ద్వారా ప్రతీరోజు 8 నుంచి 10 యూనిట్ల పవర్ వచ్చే విధంగా 6 ప్యానల్ బోర్డులు, ఇన్వర్టర్‌లను 25 సంవత్సరాల వారంటీతో ఏర్పాటు చేశారు. ఈ యూనిట్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను పాఠశాల అవసరాలకు వినియోగించి మిగులు కరెంటును పవర్ గ్రిడ్‌కు సరఫరా చేస్తారు. అంటే సాధారణ విద్యుత్ లైనులోకి రివర్స్‌గా పంపిస్తారు. ఇందుకోసం ఒక విద్యుత్ మీటర్‌ను ఏర్పాటు చేసి ఎంత విద్యుత్‌ను పవర్ గ్రిడ్‌కు ఇచ్చారనే విషయాన్ని యూనిట్ చొప్పున లెక్కించి ఆయా పాఠశాలలకు డబ్బులను విద్యుత్ సంస్థలు చెల్లిస్తాయి. ఒక్కో సోలార్ యూనిట్ ద్వారా నెలకు 250 నుంచి 300 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుండగా పాఠశాలలకు సెలవు దినాలు, వేసవి సెలవులు, చలి, వానాకాలంలో విద్యుత్ వినియోగం తగ్గి, మిగులు విద్యుత్‌ను ఎన్‌పీడీసీఎల్‌కు బదిలీ చేసే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా కేసముద్రం మండలంలోని ఒక హైస్కూల్‌కు రూ.2 వేల బిల్లు వస్తుండగా సోలార్ విద్యుత్ యూనిట్ ఏర్పాటు చేసిన అనంతరం రూ.200లకు దాటలేదని ఒక ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. ఏదేమైనా సోలార్ విద్యుత్ యూనిట్ల ఏర్పాటుతో పాఠశాలల నిర్వహణ, బోధన విధానాల్లో నూతన విప్లవాన్ని తీసుకువస్తుందని విద్యావేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలలపై బిల్లుల భారం తగ్గుతుంది..

- బీరం జనార్దన్‌రెడ్డి, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు, కేసముద్రం



సోలార్ విద్యుత్ యూనిట్ల ఏర్పాటుతో పాఠశాలలపై విద్యుత్ బిల్లులు భారం తగ్గుతుంది. పాఠశాల నిర్వహణ ఖర్చుల్లో అధిక భాగం విద్యుత్‌కే వినియోగించాల్సి ఉంటుంది. సౌర విద్యుత్‌తో బిల్లులు చెల్లించే బాధలు తప్పడమేకాకుండా పాఠశాలకే ఆదాయం వస్తుంది. తద్వారా స్కూళ్ల నిర్వహణ ఖర్చులకు మరింత చేయూతనిచ్చినట్లవుతుంది.

నేటి నుంచి సమ్మేటివ్-2 పరీక్షలు



కంబాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 14 : తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈ నెల 15 నుంచి 22 వరకు 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు సమ్మేటివ్-2 పరీక్షలు కొనసాగనున్నాయి. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలలు 1180 ఉండగా వాటిల్లో 1 నుంచి 9వ తరగతి వరకు 91 వేలకుపైగా విద్యార్థులు విద్యనభసిస్తున్నారు. 1 నుంచి 7 వరకు విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 11.30 వరకు, 8వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 11.45 వరకు, 9వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. 15న పరీక్షలు ప్రారంభం అయిన నాటి నుంచే ఏరోజు జరిగిన పరీక్షలను ఆరోజే సంబంధిత సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు మూల్యాంకనము చేసి 23న పేరెంట్స్ సమావేశాలు నిర్వహించి, ప్రోగ్రెస్ కార్డులను అందించనున్నారు.

17న మదనాపురానికి గరికపాటి



గూడూరు, ఏప్రిల్ 14 : మండలంలోని మదనాపురం శ్రీలక్ష్మీగోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి పద్మశ్రీ అవార్డు గ్రహీత, మహాసహస్ర అవధి గరికిపాటి నర్సింహారావు రానున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు లింగాల సుధీర్ రెడ్డి తెలిపారు. మదనాపురంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సుధీర్‌రెడ్డి మాట్లాడారు. ఈ నెల 17న నిర్వహించే శ్రీరామనవమి వేడుకలకు గరికపాటి నర్సింహారావు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం వేళలో ఆయన ప్రవచనాలను ఉపన్యాస రూపంలో అందించనున్నట్లు చెప్పారు. పురాణాలలో అతని ఉపన్యాసాలు విస్తృతంగా ఆచరించబడుతున్నాయని చెప్పారు.

14 ఏళ్లలోపు పిల్లలందరు విద్యనభ్యసించాలి

మానుకోట కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి మౌనిక



మాట్లాడుతున్న మౌనిక

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 14 : పద్నాలుగేళ్లలోపు పిల్లలందరూ తప్పకుండా బడికి వెళ్లి చదువుకోవాలని, వారు పనిలో కాకుండా పాఠశాలలో ఉండాలని మానుకోట కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి మౌనిక సూచించారు. మానుకోట జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ మహబూబాబాద్ ఆధ్వర్యంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సమీపంలోని ఆశాభవన్, వెల్పుల సత్యం కాలనీల్లో గల దైవకృప చిల్డ్రన్స్ హోమ్‌లో అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం చైతన్య సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మౌనిక మాట్లాడుతూ భావిభారత పౌరులైన చిన్నారులకు భారత రాజ్యాంగంలో అనేక హక్కులు కల్పించబడ్డాయని, అందులో చూపించబడిన హక్కులు అందినప్పుడే భారతదేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్సై అరుణ, కోర్టు లైజన్ ఆఫీసర్ సంపత్‌రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ రాంబాబు, లోకేష్ పాల్గొన్నారు.

అప్పులబాధతో యువకుడు ఆత్మహత్య



వెంకటేశ్వర్లు (ఫైల్)

గూడూరు, ఏప్రిల్ 14 : మండల కేంద్రం శివారు చిట్యాలగడ్డ వీధికి చెందిన బొంత వెంకటేష్ (35) ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నాగేష్ తెలిపిన వివరాల ప్రకారం. చిట్యాలగడ్డకు చెందిన బొంత వెంకటేష్ గత కొంతకాలంగా క్రితం హైదరాబాద్‌కు ఇసుక వ్యాపారం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. వ్యాపారం నష్టం వచ్చి అప్పులు అయ్యాయి. హైదరాబాద్‌లో ఉంటున్న వెంకటేష్ గూడూరులో పోచమ్మ పండుగ ఉందని ఆదివారం ఉదయం గూడూరుకు వచ్చాడు. అప్పులు ఎలా తీర్చాలని మనస్తాపంతో ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎంతకు వెంకటేష్ ఇంటి తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన భార్య లోనికి చూసే సరికి ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని విగత జీవిగా కన్పించాడు.

బోరున విలపిస్తూ కుటుంబసభ్యులకు, బంధువులకు సమాచారం అందించింది. మృతుడికి భార్య దేవత, కుమారుడు, కుమార్తె, తల్లిదండ్రులు బొంత రాములు, ఐలమ్మ ఉన్నారు. మృతుడి తండ్రిరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మను దూషిస్తోందని..

- నానమ్మను కత్తితో పొడిచిన మనవడు
- ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మృతి
- కేసు నమోదు చేసిన పోలీసులు
- జనగామ జిల్లాలో దారుణ ఘటన

జఫర్‌గడ్ (జనగామ జిల్లా), ఏప్రిల్ 14 : తల్లిని తరచుగా దూషిస్తూ గొడవ పెట్టుకుంటోందని ఆగ్రహించిన 13 ఏళ్ల మనవడు.. 65 ఏళ్ల వయసున్న నానమ్మను కత్తితో పొడిచి చంపిన దారుణ ఘటన జనగామ జిల్లాలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. జఫర్‌గడ్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులకు ఓ కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉండగా అందరి వివాహాలు చేశారు. కొడుకు సుమారు పదేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. అప్పటికే ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. అప్పటి నుంచి కోడలు, ఇద్దరు మనవలతో కలసి అందరూ ఒకేఇంట్లో ఉంటున్నారు. వ్యవసాయంతో పాటు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. అయితే కొన్నాళ్లుగా అత్తాకోడళ్ల మధ్య కుటుంబ సమస్యలపై తరచూ గొడవలు జరుగుతున్నాయి. శనివారం రాత్రి కూడా పరస్పర దూషణలతో తీవ్రంగా గొడవపడ్డారు. ఈ నేపథ్యంలో ఆగ్రహించిన చిన్నమనవడు కత్తితో నానమ్మ ఛాతిపై పొడిచాడు. దీంతో తీవ్ర రక్తస్రావం జరిగి కింద పడిపోయింది. కుటుంబీకులు వెంటనే ఆమెను అదే రాత్రి హనుమకొండ ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలోనే చనిపోయింది. ఆలస్యంగా సమాచారం అందుకున్న వర్ధన్నపేట సీఐ సూర్యప్రకాశ్, జఫర్‌గడ్ ఎస్‌ఐ శీలం రవియాదవ్ ఆదివారం ఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి

• ఆయన సేవలను కొనియాడిన వక్తలు • మానుకోటలో ఘనంగా జయంతి వేడుకలు

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 14 : మానుకోట పట్టణంలో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ జయంతిని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఆయన విగ్రహాలు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ప్రపంచ మేధావి డాక్టర్ అంబేద్కర్ అని.. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరు పాటు పడాలని పలువురు కొనియాడారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కోడ్ ఉండడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు వేర్వేరుగా జయంతి వేడుకల్లో పాలొని నివాళులర్పించారు. మానుకోట పట్టణంలో అంబేద్కర్ విగ్రహానికి కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, అదనపు ఎస్పీ చెన్నయ్య, జిల్లా అధికారులు బాలరాజు, మరియన్న, సురేష్, మునిసిపల్ కమిషనర్ నోముల రవీందర్, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

- తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నేతలు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామ సంజీవరావు, నీరుడు సామెలు, తప్పెట్ల వీరన్న, ఇనుగుర్తి సుధాకర్, రంగన్న, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, జెరిపోతుల వెంకన్న, చిదిరాల శరత్, మార్నేని కిరణ్, గుగులోతు కిషన్‌నాయక్, దౌలాగర్‌శంకర్, మహంకాళి మల్లయ్య, గుగ్గిళ్ల పీరయ్య, హరినాయక్, బోడ లక్ష్మణ్‌నాయక్, సురుగు ఐలయ్య, దర్శనం రామకృష్ణ, జానీ, మంద శశి పాల్గొన్నారు.
- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, చుక్కల ఉదయ్‌చందర్, పోతురాజు రాజు, ఎడ్ల రమేష్, కోడి శ్రీనివాస్, బోడ రవినాయక్, బానోత్ ప్రసాద్, గాడిపెల్లి చరణ్ తదితరులు పాల్గొన్నారు.
- టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు కొండపల్లి రాంచందర్‌రావు, పిట్టల రాము, ప్రేమ్ చంద్ వ్యాస్, వీరన్న పాల్గొన్నారు.
- సీపీఐ, డీహెచ్‌పీఎస్ వేడుకల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథిరెడ్డి, పెరుగుకుమార్, నర్రా శ్రావణ్, చిరంజీవి, రేషపల్లి నవీన్, సాంబలక్ష్మి, చింతకుంట్ల వెంకన్న, వెలుగు శ్రావణ్, లింగ్యానాయక్, రవీందర్, శంకర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.
- జిల్లా ఆస్పత్రిలో గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపకుడు గుగులోతు కిషన్‌నాయక్ ఆధ్వర్యంలో వైద్యులకు, సిబ్బందికి డాక్టర్ బీఆర్.అంబేద్కర్, మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బి.వెంకట్రాములు, జగదీశ్వర్, రమేష్, అబిజ్ఞా, నాగేశ్వరి, కవిత, నవ్య, మౌనిక, మాధవి, అనిత, ప్రజా సంఘాల నాయకులు బోడ రమేష్, కుర్ర మహేష్, రవీందర్ పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, కేంద్ర మాజీమంత్రి పోరిక బలరాంనాయక్, డీసీసీ అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి

- బీఎస్పీ వేడుకల్లో పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దార్ల శివరాజ్, ఎల్.విజయ్‌కాంత్, ప్రసాదరావు, ఉపేందర్, ఎడ్ల శ్రీను, బుచ్చిరాములు, తప్పెట్ల చాణక్య హేమంత్, బ్రహ్మం పాల్గొన్నారు.
- అర్బన్ పీహెచ్‌సీలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించగా ఆరోగ్య విస్తరణాధికారి వొబిలిశెట్టి రామకృష్ణ, ఉమారాణి, అనిత, రిచిత, సురేష్, వెంకటేశ్వర్లు, ఉమా పాల్గొన్నారు.
- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివవాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.సదానందం,జి. మధు, గణేష్, తండా సదానందం, భీముడు, దుప్పటి శ్రీనివాస్, సామ సత్యం, పర్వీన్‌బేగం, స్వాతి, సరిత, సృజన, నారాయణ, యాదగిరి, నాగయ్య, అన్వర్ పాల్గొన్నారు.
- ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ వేడుకల్లో అధ్యక్షుడు పాలబిందెల మల్లయ్య, ఆకుల శంభయ్య, బోనగిరి రవీంద్రగుప్తా, సదానందం, నల్లు సుధాకర్‌రెడ్డి, సోమ గోవర్ధన్, కాపరబోయిన శ్రీనివాస్, పరంధామయ్య, పమ్మిరాజు, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



మానుకోటలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

- కేవీపీఎస్ వేడుకల్లో జిల్లా కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి, జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు షేక్. మహబూబ్ పాషా, యూసూఫ్, ధర్మరాజు, సురేష్, నాగరాజు, మహేందర్ పాల్గొన్నారు.
- నలంద డీగ్రీ కళాశాలలో ఎస్సీ స్టడీ సర్కిల్ వేడుకల్లో ఏఎస్‌డబ్ల్యూవో సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.
- టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో మహనీయుల స్మృతిలో స్థానిక ఎన్టీఆర్ స్టేడియం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు మార్నింగ్ వాక్ చేపట్టి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిద్దోజు కవిత, మైస శ్రీనివాస్, చుంచు శ్రీశైలం, రమేష్, విష్ణు వర్ధన్, ఉపేందర్, సువర్ణ, విద్యాసాగర్ పాల్గొన్నారు.
- ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం వేడుకల్లో మందుల శ్రీరాములు, పార్నంది రామయ్య, చాగంటి ప్రభాకర్, వీరస్వామి, భద్రునాయక్, మహేందర్, యాకయ్య తిరుపతి, బాలాజీ, హతిరాం, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.
- గోపా వేడుకలో జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్, కంకటి ముక్తాశ్వర్, చీకటి శ్రీనివాస్, తాళ్లపల్లి రమేష్, చిర్రగాని రమేష్; కోటగిరి కుమార్, నక్క నాగార్జున పాల్గొన్నారు.
- తెలంగాణ మాలమహానాడు ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, అశోద్‌భాస్కర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ఆస్పత్రిలో బీఆర్. అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాలను పంపిణీ చేస్తున్న గుగులోతు కిషన్‌నాయక్



మానుకోటలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నివాళులర్పిస్తున్న టీపీటీఎఫ్ నేతలు

మైనారిటీ నిరుద్యోగులకు చక్కటి అవకాశం

వడ్డెపల్లి, ఏప్రిల్ 14 : మైనారిటీల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక పథకాలను రూపొందించి అమలు చేస్తోంది. పోటీ పరీక్షల కోసం మైనారిటీ ఉద్యోగులకు ఉచిత శిక్షణను ఇస్తూ వారిని ప్రోత్సహిస్తోంది. యూపీఎస్సీ- సీఎ్ాఎటీ- 2025 పరీక్ష కోసం 2024-25 విద్యా సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, మైనారిటీల సంక్షేమ శాఖ 100 మంది మైనారిటీస్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ నిర్వహిస్తుంది. రిజర్వేషన్ల నిబంధనల ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33 శాతం సీట్లు, అన్ని రిజర్వ్ కేటగిరీలలో దివ్యాంగులకు 5 శాతం సీట్లను కేటాయించారు.

దరఖాస్తు చేసుకునే విధానం

యూపీఎస్సీ (సీఎస్ఏటీ- 2025) సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్టులో ప్రవేశం కోసం అన్ని జిల్లాల్లోని సాధారణ/ ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తి చేసిన మైనారిటీస్ అభ్యర్థులు ఈ నెల 22 లోగా ఆన్‌లైన్ లో గిగిగ్బిఝుట్బజీట్బ జ్బుబ్బ.చిజుజొరి.జీ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలి. స్ర్కీనింగ్ టెస్టు ఈనెల 28న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలల్లో నిర్వహిస్తారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మేన శ్రీను, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి



ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని జిల్లాలోని మైనారిటీస్ నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి. డిగ్రీ పూర్తి చేసిన సాధారణ, ప్రొఫెషనల్ అభ్యర్థులు ఈ నెల 22 లోగా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను చేసుకోవాలి. ప్రవేశం పూర్తిగా మెరిట్ ప్రాతిపదికన నిర్వహిస్తారు. ఈ నెల 28న నిర్వహించే స్ర్కీనింగ్ టెస్టులో మైనారిటీ అభ్యర్థులు పాల్గొనాలన్నారు. వివరాలకు ఫోన్ నంబరు : 040- 23236112 లో సంప్రదించాలి.

కడియం కావ్యకే మా మద్దతు


ఎమ్మెల్యే శ్రీహరిని కలిసిన దళిత సంఘాల నేతలు

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 14 : వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యకు తెలంగాణ మాదిగ దండోరా, టీ ఎమ్మార్పీఎస్, తెలంగాణ బైండ్ల సంఘం, మాల మహానాడు నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్న తెలిపారు. ఆదివారం హనుమకొండలోని ఎమ్మెల్యే కడియం శ్రీహరి నివాసంలో కలిసి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించి మంద కృష్ణ మాదిగకు తగిన బుద్ధి చెబుతామని తెలిపారు. వర్గీకరణ పేరుతో మాదిగలను, మాదిగ ఉప కులాలను మంద కృష్ణ మోసం చేస్తున్నారని వారు ఆరోపించారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. మంద కృష్ణ మాదిగ జాతికే ద్రోహం చేయాలని చూస్తున్నారని, దేశ వ్యాప్తంగా దళితుల ఊచ కోతకోస్తున్న బీజేపీ పంచనచేరి ఏ విధంగా ఓటు అడుతున్నాడో చెప్పాలని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకొని దేశాన్ని మతతత్వ పార్టీ నుంచి కాపాడుకోవాలని కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపకులు జన్ను కనకరాజు, జాతీయ అధ్యక్షుడు వేముల బలరాం, రాష్ట్ర అధ్యక్షుడు కోరిపెల్లి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పద్మారావు, బైండ్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అదుళ్ల గౌరిశంకర్, మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి పసుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై కుట్ర


హనుమకొండ జేఎన్ఎస్‌లోని హ్యాండ్‌బాల్ మినీ స్టేడియం

- అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు చుక్కెదురు
- స్పోర్ట్స్ హాస్టల్ నుంచి తరలించేందుకు ప్రయత్నాలు
- అంతర్మథనంలో క్రీడాకారులు.. ఖండిస్తున్న క్రీడా సంఘాలు
- ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి


హనుమకొండ జేఎన్ఎస్‌లోని రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 14 : అథ్లెటిక్స్ హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు స్పోర్ట్స్ హాస్టల్ అందని ద్రాక్షగా మారుతోందనే సమాచారంతో అంతర్మథనం చెందుతున్నారు. యేళ్లతరబడి అథ్లెటిక్స్ హ్యాండ్‌బాల్ క్రీడల్లో అద్భుత ప్రతిభ చాటుతూ స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించినక్రీడాకారులను ఇక్కడి నుంచి తరలించాలనే ప్రయత్నాలు జరుగుతున్నట్లు వస్తున్న వార్తలతో ఆందోళన చెందుతున్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) ఆదేశాలతో రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లోని అథ్లెట్లకు వేరే ప్రాంతాలకు పంపించే యోచనలో స్పోర్ట్స్ అధికారులు ఉన్నట్లు తెలిసి క్రీడాకారులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుల కేంద్రంగా పేరుగాంచిన హనుమకొండలోని రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్ తీరుపై జిల్లాకు చెందిన మంత్రులు కొండా సురేఖ, సీతక్కలు స్పందించాలని పలు క్రీడా సంఘాల బాధ్యులు వేడుకుంటున్నారు.

తరలింపు ఆలోచన

హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూస్టేడియం (జేఎన్ఎస్)లో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ(డీఎస్ఏ) ఆధ్వర్యంలో మూడు దశాబ్దాల నుంచి రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్ హ్యాండ్‌బాల్ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ ఆధారంగా రాణించిన క్రీడాకారులకు వసతి కల్పిస్తూ క్రీడల్లో శిక్షణ అందిస్తోంది. అయితే జిమ్నాస్టిక్ క్రీడాకారులను మినహాయించి అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులను వేరే ప్రాంతాలకు తరలించే ప్రయత్నం జరుగుతోందనే వాదనలతో క్రీడాకారులు ఆందోళన చెందుతున్నారు అథ్లెటిక్స్ హ్యాండ్‌బాల్ క్రీడలను హాస్టల్ నుంచి తొలిగించి వాటి స్థానంలో మరో రెండు క్రీడలను అనుమతించే అవకాశం ఉందని పలువురు క్రీడా సంఘాల సభ్యులు అనుమానంవ్యక్తం చేస్తున్నారు.

కొందరి కుట్ర

కొందరు వ్యక్తులు తమకు అనుకూలంగా ఉన్న క్రీడలను హాస్టల్‌లో వసతి కల్పించాలనే దురాలోచనతోనే అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు స్పోర్ట్స్ హాస్టల్ ఎత్తివేసే ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగా స్పోర్ట్స్ హాస్టల్‌లో అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు అనుమతి ఇవ్వకపోవడంతో ఇంతకాలం శిక్షణ పొందిన క్రీడాకారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది. దీనిపై స్పోర్ట్స్ అధికారులు పునరాలోచన చేయావలసిన అవసరం ఉందని, లేదంటే నిరసనలకు శ్రీకారం చుడతామని క్రీడాకారులు, క్రీడాసంఘాల బాధ్యులు హెచ్చరిస్తున్నారు.

30 ఏళ్ల కిందట

30 ఏళ్ల కిందట టీడీపీ హయాంలో జిల్లాకు చెందిన అప్పటి మంత్రి దాస్యం ప్రణయ్‌బాస్కర్ ప్రత్యేక చొరవతో జేఎన్ క్రీడా మైదానం అభివృద్ధితో పాటు క్రీడాకారులకు భోజన, బస వసతి కల్పించడానికి రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌ను నిర్మించారు. జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్ హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు వసతితోపాటు పౌష్టికాహారం, అనుభవజ్ఞులైన కోచ్‌ల పర్యవేక్షణలో శిక్షణ అందిచండం కోసం ఉమ్మడి జిల్లా కేంద్రంగా స్పోర్ట్స్ హాస్టల్ నిర్మించారు. 9 ఏళ్ల వయస్సులోనే క్రీడాకారుల కోసం యేటా డీఎస్ఏ ఆధ్వర్యంలో రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశాలు కల్పిస్తోంది. డీఎస్ఏ ఆధ్వర్యంలో బ్యాటరీటెస్ట్‌లు నిర్వహిస్తూ ప్రతిభ ఆధారంగా స్పోర్ట్స్ హాస్టల్‌కు క్రీడాకారులను ఎంపిక చేస్తారు. ఎంపిక చేసిన క్రీడాకారులకు మౌలిక వసతులతోపాటు శిక్షణ అందింస్తోంది. నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ క్రీడాకారుల కు బాసటగా నిలుస్తూ.. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో తాత్కాలిక డీఎస్ఏ కోచ్‌ల పర్యవేక్షణలో జేఎస్ఎస్‌లోని వివిధ మైదానాల్లో పలు క్రీడాంశాలలో శిక్షణను అందిస్తోంది. అలాగే రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో పౌష్టికాహారంతో పాటు క్రీడా దుస్తులు, వసతి సౌకర్యాలను అందిస్తోంది. ప్రధానంగా అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, జిమ్నాస్టిక్స్ క్రీడలతోపాటు పలు క్రీడాంశాలలో ఓనమాలు నేర్చుకొని జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా గుర్తింపు తెచ్చుకుంటున్నారు. స్పోర్ట్స్ కోటాలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో వందలాదిగా ఉద్యోగాలు పొందారు.

మాకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదు..
జి.అశోక్‌కుమార్, జిల్లా యువజన క్రీడల అధికారి



రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో వసతి పొందుతున్న అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులను వేరే చోటికి తరలించాలని మాకు ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ఉత్తర్వులు అందలేదు. ఇటీవల హైదరాబాద్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) ఆధ్వర్యంలో సమావేశం జరిగింది వాస్తవమే. అందులో ఇక్కడి క్రీడాకారుల ప్రతిభ, స్పోర్ట్స్ హాస్టల్ నిర్వహణ వంటి అంశాలపై చర్చ జరిగింది.

క్రీడాకారులకు నష్టం జరుగుతుంది..
బైరబోయిన కైలాస్ యాదవ్, వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి



రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో వసతి పొందుతున్న అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులను వేరే చోటికి తరలిస్తే తీవ్ర నష్టం జరుగుతుంది. క్రీడాకారులను ఉన్న ఫలంగా హాస్టల్ నుంచి పంపించే ప్రయత్నం సరైందికాదు. అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారుల మనోవేదనను అర్థం చేసుకొని జిల్లా క్రీడాశాఖ అధికారులు సాట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి హాస్టల్‌ను క్రీడాకారులను వేరే చోటుకు తరలించకుండా పునరాలోచన చేయాల్సి ఉంది.

తరలించే ప్రయత్నం సరైందికాదు
ఇండ్ల నాగేశ్వర్‌రావు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు



రీజినల్ స్పోర్ట్స్‌హాస్టల్‌లో అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులను వేరే ప్రాంతాలకు తరలించే ప్రయత్నం సరైందికాదు. దీనిని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తోంది. అందుబాటులో ఉన్న అకాడమీ, స్పోర్ట్స్ హాస్టల్‌లో మౌలిక వసతులను కల్పించకుండా కొందరు స్వార్థపరులు క్రీడాకారులను అంధకారంలోకి తీసుకపోయే ప్రమాదం ఉంది. నగరంలో నూతన అకాడమీల ఏర్పాటుకు స్పోర్ట్స్ అధికారులు, మంత్రులు కొండా సురేఖ, సీతక్క కృషి చేయాలి.

కళాకారులకు పుట్టినిల్లు ఓరుగల్లు

- ఏఐఆర్ మాజీ డైరెక్టర్ జైపాల్ రెడ్డి


ఆల్ ఇండియా రేడియో జర్నలిస్టులతో జైపాల్ రెడ్డి

హనుమకొండ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు నగరం కళాకారులకు పుట్టినిల్లని ఆల్ ఇండియా రేడియో మాజీ ఉపసంచాలకుడు చల్లా జైపాల్ రెడ్డి అన్నారు. వరంగల్ రేడియో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు మోటే చిరంజీవి ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ రేడియో కేంద్రం ఎంతోమంది కళాకారుకులకు అవకాశం కల్పించిందని అన్నారు. ఎంతో మంది వ్యాఖ్యాతలు ఇక్కడ పని చేసి పేరు ప్రతిప్రతిష్టలు సంపాదించారని అన్నారు. వ్యాఖ్యాతలకు గతంలో ఉన్న కార్యక్రమాలు ఇప్పుడు లేవని, అలాగే వ్యాఖ్యాతల కార్యక్రమాలు అప్పటి కంటే ఇప్పుడు తగ్గాయని అన్నారు. చక్కటి స్వరంతో కార్యక్రమాలను వ్యాఖ్యాతలు విజయవంతం చేస్తున్నారని అన్నారు. వరంగల్ రేడియో జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం రిటైర్డ్ సీనియర్ వ్యాఖ్యాతలు నెల్లుట్ల సంధ్య, మొగిలిచెర్ల జనార్దన్‌లను ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ.. తమ సేవలను గుర్తించి సన్మానం చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. అలాగే రేడియోతో ఉన్న 30 యేళ్ల అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ రేడియో జర్నలిస్టు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అర్షం సదానందం, గౌరవ సలహాదారు డాక్టర్ ఎల్లయ్య, అసోసియేషన్ నాయకులు ఓదెల కృష్ణ, డాక్టర్ చంద్రశేఖర్, రామక్రిష్ణ, డాక్టర్ శ్రీనివాస్, పంకజ్ మోహన్, స్వప్న, స్వాతి, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

సౌండ్ పొల్యూషన్ బైక్ స్వాధీనం

వరంగల్ క్రైం, ఏప్రిల్ 14 : సౌండ్ పొల్యూషన్ సైలెన్సర్ బైక్ వాడి అతివేగంతో వెళుతున్న వినయ్‌తేజరెడ్డి అనే విద్యార్థిపై కేయూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం సాయంత్రం సౌండ్‌తో కూడిన సైలెన్సర్ కలిగిన బుల్లెట్‌పై అతివేగంగా వెళుతున్న విద్యార్థిని భీమారం జంక్షన్ వద్ద అరెస్టు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. బుల్లెట్ స్వాధీనం చేసుకుని విద్యార్థిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రెడ్డిపురం కుంటలో మునిగి యువకుడి మృతి


వాజీద్ మృతదేహం

వరంగల్ క్రైం, ఏప్రిల్ 14 : కేయూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెడ్డిపురం కుంటలో మునిగి యువకుడు మరణించిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. హనుమకొండ అగ్నిమాపక శాఖధికారి నాగరాజు కథనం ప్రకారం.. రెడ్డిపురం కుంటలో ఈత కోసం దిగిన యువకుడు మునిగిపోయాడని వచ్చిన సమాచారం మేరకు వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. బోటు సహాయంతో కుంటలో గాలించగా గంట తర్వాత మృతదేహం లభించింది. యువకుడి ఆచూకీకోసం ఆరాతీయగా రాయపురకు చెందిన వాజీద్ (25)గా గుర్తించారు. కాగా, విచారణ కోసం స్థానిక పోలీసులకు మృతదేహాన్ని అప్పగించినట్లు ఫైర్ ఆఫీసర్ నాగరాజు తెలిపారు. మృతదేహాన్ని వెలికితీయడంలో హనుమకొండ అగ్నిమాపకశాఖధికారి నాగరాజుతోపాటు వరంగల్ జిల్లా ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ రవీందర్, హనుమకొండ, వరంగల్ ఫైర్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

- రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు
- రత్నగిరిలో విషాదం


రాహుల్ (ఫైల్)

భీమదేవరపల్లి, ఏప్రిల్ 14 : భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామానికి చెందిన బానోతు రాహుల్ (15) అనే విద్యార్థి రోడ్డు ప్రమాదంలో గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వంగర ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం తన అమ్మమ్మ గారి ఊరు సిద్దిపేట జిల్లా జిల్లెలగడ్డకు వెళ్లి రాహుల్ తిరిగి వస్తున్నాడు. భీమదేవరపల్లి మండలం మంగళపల్లి శివారులో ట్రాక్టర్ డ్రైవర్ ఆకస్మాత్తుగా మూల మలుపు వద్ద తిప్పడంతో రాహుల్ ద్విచక్రం వాహనానికి ట్రాక్టర్ తగిలి రాహుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే రాహుల్‌ను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ రాహుల్ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. రాహుల్ 2024 మార్చిలో పదో తరగతి పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తు న్నాడు. మండలంలోని వంగర హైస్కూల్లో పదో తరగతి చదివి పరీక్షలు రాశాడు. 15ఏళ్ల బాలుడు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నారు.

నీరుకుళ్లలో సంచరిస్తున్న పునుగు పిల్లలు

- జూపార్క్‌కు తరలించిన ఫారెస్ట్ అధికారులు


బకెట్‌లో దూరిన పునుగు పిల్లి

ఆత్మకూరు, ఏప్రిల్ 14 : అరుదైన పునుగు పిల్లులు నీరుకుళ్ల గ్రామానికి చెందిన పంచి నేని రాజేశ్వరరావు ఇంట్లో ఆదివారం దర్శనమిచ్చాయి. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నీరుకుళ్ల గ్రామంలో తన ఇంటికి ఉదయం పునుగు పిల్లి కుక్కలను చూసి ఇంట్లోకి వచ్చిందన్నారు. వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వచ్చి పునుగు పిల్లి అని నిర్ధారించుకుని, బంధించి వరంగ ల్ జూపార్క్‌కు తరలించారు. మరొకటి చెట్ల పొదల్లోకి పారిపోగా కుక్కలు వెంబడించడంతో పారిపోయిందన్నారు. గత వారం క్రితం కుక్కలు వెంబడించి పునుగు పిల్లిని చంపి తిన్నట్లు గ్రామస్తులు తెలిపారు. అరుదైన పునుగు పిల్లి గ్రామంలో సంచరించడంతో గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు. వెంకటేశ్వరస్వామికి ఎంతో ఇష్టమైన పునుగు పిల్లి తన ఇంట్లోకి రావడంతో ఎంతో అదృష్టంగా వెంకటేశ్వరరావు భావిస్తున్నారు.

కేసీఆర్‌ను కలిసిన సుధీర్‌కుమార్


కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సుధీర్‌కుమార్

రాంనగర్, ఏప్రిల్ 14 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి మారపెల్లి సుధీర్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. రెండు రోజుల కిందట సుధీర్‌కుమార్‌ను బీఆర్ఎస్ అభ్యర్థిగా కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. అవకాశం దక్కించుకున్న సుధీర్‌కుమార్.. ఆదివారం హైదరాబాద్‌లో కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సుధీర్‌కుమార్ వెంట మాజీ ఎమ్మెల్యే రాజయ్య కూడా ఉన్నారు. రాజయ్య ఎంపీ టికెట్ ఆశించినప్పటికీ సుధీర్ కుమార్‌కు అవకాశం దక్కిన విషయం తెలిసిందే. టికెట్ ఆశించి భంగపడ్డ రాజయ్యను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కేసీఆర్ వద్దకు తీసుకెళ్లారు. అభ్యర్థి సుధీర్ కుమార్‌తో పాటు రాజయ్య మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశారు.

బియ్యం దొంగలపై నజర్

- ప్రజా పంపిణీ బియ్యం అక్రమ రవాణా కట్టడికి చర్యలు
- ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం
- దందా చేసే వారి వివరాల సేకరణలో విజిలెన్స్
- పోలీసులు, ప్రజా ప్రతినిధుల ప్రమేయంపై ఆరా
- కేసులు పెట్టేందుకు రంగం సిద్ధం



వరంగల్ క్రైం, ఏప్రిల్ 14 : ప్రజాపంపిణీ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. దందా చేసేవారిపై కేసులు పెట్టేందుకు సిద్ధమైంది. రాష్ట్ర వ్యాప్తంగా చర్యలకు పూనుకున్న ప్రభుత్వం.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పీడీఎస్ రైస్ కట్టడిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాన్ని వరంగల్‌కు పంపింది. పదిరోజులుగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రహస్యంగా పర్యటిస్తూ అక్రమార్కుల వివరాలు సేకరిస్తున్నారు. కోట్లలో నడుస్తున్న దందాలో పెద్ద తలకాయలు ఉన్నట్లు సమాచారం ఉండటంతో ఆ కోణంలో కూడా అధికారులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఇటీవల కాళేశ్వరం, ఎల్కతుర్తి, చిల్పూరు ప్రాంతాల్లో అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. యథేచ్ఛగా సాగుతున్న దందా వెనుక పలువురు పోలీసులు, ప్రజాప్రతిధుల సహకారం అందుతుందనే ఆరోపణలున్నాయి. దందాకు సహకరించే వారికి నెలవారీగా మామూళ్లు అందుతాయని అధికారిక సమాచారం.

ప్రజాప్రతినిధులు, పోలీసుల ప్రమేయంపై ఆరా..

ఈ దందాలో ప్రజాప్రతినిధులు, పోలీసుల ప్రమేయంపై రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. హనుమకొండ నుంచి హుజూరాబాద్ వరకు దందా చేస్తున్న ఇద్దరు దళారులకు పలువురు పోలీసులు సహకరించారనే ఆరోపణలున్నాయి. సహకరించిన పోలీసుల వివరాలు విజిలెన్స్ అధికారులు సేకరించినట్లు తెలిసింది. వీరితోపాటు ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా దందా చేసే వారికి అండగా నిలుస్తున్న పోలీసులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతల చిట్టా తయారు చేస్తున్నట్లు సమాచారం. మొత్తంగా ఈ దందాలో ప్రమేయం ఉన్న వారి జాబితా సిద్ధం చేసి ప్రభుత్వానికి అప్పగించే పనిలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఉన్నట్లు తెలిసింది.

జిల్లా విజిలెన్స్ అధికారుల పనితీరుపై ఆరోపణలు

జిల్లాకు చెందిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తీరుపై పలు ఆరోపణలు ఉన్నాయి. జిల్లాకు చెందిని కొంతమంది అధికారుల కనుసన్నల్లోనే ఈ దందా సాగుతుందనే విమర్శలున్నాయి. జిల్లాలో పనిచేసే ఒక హెడ్‌కానిస్టేబుల్ అధికారి ఒకే స్థానంలో దశాబ్దకాలంగా పనిచేస్తూ దందా చేసే వారికి అండగా ఉంటున్నాడనే ఆరోపణలున్నాయి. ఈ హెడ్‌కానిస్టేబుల్ పై అధికారులను మేనేజ్ చేస్తాడనే విమర్శలున్నాయి. దందా చేసే వారి నుంచి వసూళ్లు చేసి అధికారులకు స్థాయిల వారిగా ముట్టచెబుతాడనే ప్రచారం ఉంది. జిల్లా అధికారుల తీరు సరిగాలేకనే రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం జిల్లాలో పర్యటిస్తున్నట్లు అధికారిక సమాచారం.

ప్రాంతాల వారిగా దళారులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలువురు ఈ దందా చేస్తూ కోట్లు మూటగట్టుకున్నట్లు తెలిసింది. ప్రాంతాల వారిగా పెత్తనం చెలాయిస్తూ యథేచ్ఛగా పీడీఎస్ రైస్ దందా చేస్తున్నారు.

- భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్‌కు చెందిన ఒక వ్యక్తి వరంగల్, హనుమకొండ జిల్లాలో ఈ దందా చేస్తున్నట్లు తెలిసింది. ఈయనపై గతంలో పీడీ యాక్ట్ కేసు నమోదు అయినట్లు సమాచారం. గతంలో ఒక పోలీస్ కమిషనర్ ఈయనను నగరంలో ఉండకూడదనే ఆంక్షలు సైతం పెట్టినట్లు తెలిసింది. ఆ అధికారి బదిలీ అయ్యాక దందాను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు సమాచారం.
- మంథినికి చెందిన ఒక వ్యక్తి ఈ దందాలో నిష్ణాతుడనే పేరుంది. ఇతడు జిల్లాకు చెందిన విజిలెన్స్ అధికారులను సైతం మేనేజ్ చేస్తాడనే ప్రచారం ఉంది. భూపాలపల్లి, ములుగు ఏరియాల్లో ఇతడి మనుషులతో దందా సాగిస్తున్నట్లు సమాచారం.
- బుద్ధారానికి చెందిన మరో వ్యక్తి సైతం ఈ దందా చేస్తాడని తెలిసింది.
- ములుగు జిల్లాకు చెందిన ఒక రైస్ మిల్లు యజమాని పీడీఎస్ రైస్ దందా చేస్తాడని తెలిసింది. తన మనుషులతో గ్రామాల్లోని పీడీఎస్ బియ్యం సేకరించి రైస్‌మిల్లు అడ్డుపెట్టుకుని పెద్దఎత్తున దందా చేస్తాడని సమాచారం.
- మంథనికి చెందిన ఒక వ్యక్తి మహారాష్ట్ర సిరివంచలో రైస్‌మిల్లు నడుపుతూ ఈ దందా చేస్తాడని తెలిసింది. ఇతడి దందాకు ఆ ఏరియా పోలీసులు సహకరిస్తారనే ప్రచారం ఉంది.
- ఇక హనుమకొండ నుంచి హుజూరాబాద్ వరకు ఇద్దరు వ్యక్తులు పీడీఎస్ రైస్ దందా చేస్తూ కోట్లు సంపాదించారనే ఆరోపణలున్నాయి. గ్రామాల నుంచి సేకరించే బియ్యాన్ని కిట్స్ కళాశాల ఏరియాలో, ఓఆర్ఆర్ ఏరియాలో నిల్వచేసి రాత్రి వేళల్లో కొంతమంది పోలీసుల సహకారంతో పొరుగు రాష్ట్రాలకు తరలిస్తారనే ప్రచారం ఉంది. ఈ ఇద్దరిలో ఒక వ్యక్తితో పలువురు పోలీసు అధికారులు సన్నిహితంగా ఉంటూ అతడు ఇచ్చే తాయిళాలు నెలనెల అందుకుంటారనే విమర్శలున్నాయి. ఇలా విచ్చలవిడిగా వరంగల్‌లో అన్ని ప్రాంతాల్లో దందా సాగుతున్నట్లు తెలిసింది. వీరందరి సమాచారం సేకరిస్తున్న రాష్ట్ర విజిలెన్స్ అధికారులు నివేదిక తయారు చేస్తున్నట్లు సమాచారం.

ఆరు లీటర్ల గుడుంబా స్వాధీనం

డోర్నకల్, ఏప్రిల్14 : మండలంలోని గుర్రాలకుంట గ్రామపంచాయతీ శివారు టేకులతండాలో ఓ మహిళ వద్ద నుంచి ఆరులీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. టేకులతండాకు చెందిన తీత్రీ అనే మహిళ గుడుంబా తయారు చేసి విక్రయిస్తుందన్న సమాచారంతో దాడులు నిర్వహించగా, ఆరులీటర్ల గుడుంబా పట్టిబడినట్లు ఎస్సై తెలిపారు. సదరు మహిళపై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

వడదెబ్బకు వృద్ధుడు మృతి



దొడ్డ గోపయ్య (ఫైల్)

గార్ల ఏప్రిల్ 14 : మండలంలోని బుద్ధారంలో వడదెబ్బకు శతాధిక వృద్ధుడు దొడ్డ గోపయ్య (108) మృతి చెందాడు. ఆదివారం మృతుడి భార్య లింగమ్మ తెలిపిన వివరాల ప్రకారం. గత మూడు రోజులుగా ఎండతీవ్రతను తట్టుకోలేక ఇబ్బంది పడ్డాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి మృతి చెందాడు. గోపయ్య-లింగమ్మ దంపతులకు ఆరుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు కలిగి ఉన్నారు. వీరి వంశ వృక్షం ప్రస్తుతం 80 మంది ఉంటామని లింగమ్మ తెలిపారు.

కాంగ్రెస్ నాయకుడు అదృశ్యం



చిర్రగోని సారయ్య (ఫైల్)

కేసముద్రం, ఏప్రిల్ 14 : మండలంలోని అమినాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు, మార్కెట్ మాజీ వైస్‌చైర్మన్ చిర్రగోని సారయ్య ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి బయటకు వెళ్లి కనిపించకుండా పోయినట్లు ఎస్సై వంశీధర్ తెలిపారు. కొంతకాలంగా మెదడు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న ఆయన ఆదివారం తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లగా, ఆయన కోసం కుటుంబసభ్యులు వెతికనప్పటికి ఆచూకి లభ్యం కాలేదు. ఈ మేరకు ఆయన కుమారుడు శ్యాంప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా, సారయ్య అదృశ్య విషయం తెలిసిన కాంగ్రెస్ నేతలు కొంత ఆందోళనకు గురై సారయ్య ఆచూకి కోసం ప్రయత్నిస్తున్నారు.

లక్ష్మక్క జాతరలో ఎంపీ కవిత పూజలు

గూడూరు, ఏప్రిల్ 14 : అప్పరాజుపల్లిలో గిరిజనుల ఆరాధ్యదైవమైన శ్రీలక్ష్మక్క జాతర ఆదివారం ప్రారంభమైంది. మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన పూజారి దారావత్ బిచ్చా పూజలు నిర్వహించారు. జాతర శివారు గ్రామాలైన అప్పరాజుపల్లి, కోల్లాపురం, దుబ్బగూడెం, బొద్దుగొండ, గోవిందపురం, జంగుతండ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో దారావత్ భాస్కర్‌నాయక్, దారావత్ శ్యాం, ముత్యం వెంకన్న, మూడు మోహన్, పొన్నాల యుగేందర్, చందర్, జైపాల్, మాధవపెద్ది గీతాఅమరేందర్‌రెడ్డి, మాధవపెద్ది విజయశ్రీవిజేందర్‌రెడ్డి, వేముల వెంకన్న పాల్గొన్నారు.

వెన్నారంలో పోలీసుల కవాతు



వెన్నారంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు

డోర్నకల్, ఏప్రిల్ 14 : మండలంలోని వెన్నారంలో ఆదివారం సీఐ ఉపేందర్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం ఎస్సై సంతోష్‌రావు, సీఆర్‌పీఎఫ్ పోలీస్ బలగాలతో కవాతు నిర్వహించారు. అనంతరం వెన్నారం బొడ్రాయి సెంటర్‌లో సీఐ మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో ప్రజలందరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎవరి బెదిరింపులు, ప్రలోభాలకు లొంగకుండ నిర్భయంగా ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా అంబేద్కర్ జయంతి



తొర్రూరులో అంబేద్కర్ విగ్రహంకు పూలమాల వేసి నివాళ్లర్పిస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

మహబూబాబాద్‌టౌన్, ఏప్రిల్ 14 : జిల్లాలోని అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. మరిపెడలో మునిసిపల్ చైర్మన్ సింధూరకుమారి, మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటస్వామి, మండల పరిషత్‌లో ఎంపీపీ, ఎంపీడీవో అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు వేర్వేరుగా పూలమాలలు వేసి, నివాళ్లర్పించారు. వార్డు కౌన్సిలర్ ఎడెల్లి పరుశురాములు, అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు వెంకటేష్, అశోక్, హరీష్, సైదులు, మల్సూర్, రాకేష్, జగదీష్, కృష్ణ, సునీల్, శివ, రజినీకాంత్, సృజన్, వంశీ, వెంకన్న పాల్గొన్నారు.

- మరిపెడ మండలంలోని అనేపురంలో .అంబేద్కర్ విగ్రహానికి విగ్రహ స్థాపకుడు తుళ్ల హస్సేన్ పూలమాలవేసి. నివాళ్లర్పించారు.దామెర్ల వీరన్న, ప్రశాంత్, శ్రీనివాస్, వైష్ణవి, యాకన్న, నవీన్, జానీ, హరికృష్ణ, శ్రీను, సతీష్, అమ్మునాయక్ పాల్గొన్నారు.
- దంతాలపల్లిలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. శ్రావణ్, నగేష్, రామకృష్ణ, దాట్ల, పెద్దముప్పారం, దంతాలపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.
- పెద్దవంగరలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రంగు మురళీగౌడ్, చిలుక దేవేంద్ర, ముత్యాల పూర్ణచందర్, సైదులు, సీతారాంనాయక్, వేణు, శ్రీనివాస్, హరికృష్ణ, రవీందర్‌రెడ్డి, జగదీష్‌బాబు, రవి, సంపత్, యాకన్న అంబేద్కర్ విగ్రహానికి నివాళ్లర్పించారు.
- తొర్రూరు పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జడ్పీటీసీ మంగళంపల్లి శ్రీనివాస్, మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, దళితరత్న గుండాల నర్సయ్య, రాయిశెట్టి వెంకన్న, యాకేందర్, ఉపేందర్ పాల్గొన్నారు.
- తొర్రూరు మండలం ఫత్తేపురం, అమ్మాపురం, వెలికట్టే, హరిపిరాలలో అంబేద్కర్ విగ్రహాలకు వివిధ యువజన, ప్రజాప్రతినిధులు, అంబేద్కర్ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. వైస్ ఎంపీపీ శ్యాంసుందర్‌రెడ్డి, డెనక ఉప్పలయ్య, పోసాని పుష్పలీల, అశోక్, పోసాని రాములు పాల్గొన్నారు.
- కొత్తగూడ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మిడతపెల్లి యాకయ్య, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు రాజం సారంగం, తుడుందెబ్బ రాష్ట్ర సంస్కృతిక కార్యదర్శి ఆగబోయిన రవి, కాంగ్రెస్, బీఆర్ఎస్ అధ్యక్షుడు వజ్జ సారయ్య, కొమ్మనబోయిన వేణు, నారాయణరెడ్డి, సిద్దబోయిన బిక్షం, సురేష్, వెంకన్న, నెహ్రూ, సందీప్, వేణు, సమ్మయ్య పాల్గొన్నారు.
- డోర్నకల్‌లో దళిత సంఘాల ఆధ్వర్యంలో సుభాష్‌వీధి నుంచి అంబేద్కర్ చిత్రపటంతో అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ప్రాథమికోన్నత పాఠశాలలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఉపేందర్, సిబ్బంది అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు. పరకాల రెండోఅదనపు మెజిస్ట్రేట్ కొప్పుల శంకర్, బీఆర్.వీరస్వామి, నాయిని వెంకటేశ్వర్లు, పేరాల నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు సుమీర్‌చంద్‌జైన్, తలారి విద్యాసాగర్, వెంపటి సీతారాములు, కొత్తపల్లి నర్సింగరావు పాల్గొన్నారు



మరిపెడలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళ్లర్పిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ సింధూరకుమారి

- నర్సింహులపేట మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. మండల కేంద్రంలో డిప్యూటీ తహసీల్దార్ సంజీవ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళ్లర్పించారు. జయపురం, పెద్దనాగారం, బొజ్జన్నపేట, రామన్నగూడెం, ముంగిమడుగు, బంజర, పడమటిగూడెం గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. బొజ్జన్నపేటలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించి అనంతరం మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు.
- నెల్లికుదురులో మాల మహానాడు ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. అశోదభాస్కర్, హెచ్.వెంకటేశ్వర్లు,కారం ప్రశాంత్, బొడ్డు అశోక్, చదల యాకాంతం, గుండెపాక ఉప్పలయ్య బిర్రు యాకయ్య, బాబుగౌడ్, వరిపెల్లి పూర్ణ, ఉప్పలయ్య, మౌనేందర్, రత్నపురం యాకయ్య, సలుగు హన్మంతు, మాజీ సర్పంచ్ బీరవెల్లి యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.
- గూడూరు మండలం అప్పరాజుపల్లి, పొనుగోడు, గూడూరు గ్రామాల్లో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. అప్పరాజుపల్లిలో మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళ్లర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ముత్యం వెంకన్న, మూడు మోహన్, యుగేందర్, జైపాల్, చందర్, దారావత్ భాస్కర్, మాధవపెద్ది గీతఅమరేందర్‌రెడ్డి, మాధవపెద్ది విజయశ్రీవిజేందర్‌రెడ్డి, వేముల వెంకన్న, ఎడెల్లి మధు, ఓస రాము, కృష్ణ, సాయిరాం, పూర్ణచందర్, రణధీర్, బెజ్జం రమేష్, బొల్లికొండ మధు, రహీం, నూనావత్ రమేష్‌నాయక్, రాధికసురేందర్, సీహెచ్.వీరస్వామి, రామన్ననాయక్, రమేష్, పానుగంటి నర్సయ్య, నూకల ఉపేందర్, బోడ వెంకన్న పాల్గొన్నారు.
- గార్ల పోలీస్‌స్టేషన్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి మాజీ ఎంపీపీ మాలోతు వెంకట్‌లాల్, గార్ల ఎస్సై జీనత్‌కుమార్, తాళ్లపల్లి కిష్టగౌడ్, జవ్వాజీ శ్రీనివాస్, మంద రాముగౌడ్, బాదావత్ ప్రసాద్, నేతగాని ధర్మయ్య, సీపీఎం నాయకులు కందునూరి శ్రీనివాస్, వంగూరి వెంకటేశ్వర్లు, కట్టెబోయిన శ్రీనివాస్, జంపాల వెంకన్న పాల్గొన్నారు.
- బయ్యారం, గంధంపల్లి బస్టాండ్ సెంటర్‌లలో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలో నివాళ్లర్పించారు. ఆయా కార్యక్రమాల్లో శ్రీనివాస్, రవి, రాజేష్, బిక్షపతి, నాగయ్య గణేష్, వెంకన్న, సురేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులతో ఉద్యోగ, కులసంఘాల నేతలు మద్దతు ప్రకటిస్తూ జయంతిలో పాల్గొన్నారు.



డోర్నకల్‌లో అంబేద్కర్ భారీ చిత్రపటంతో ర్యాలీ నిర్వహిస్తున్న దళిత సంఘాల నాయకులు

- కురవిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జడ్పీటీసీ బండి వెంకట్‌రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐలు నరహరి, బాదె నాగయ్య, గుగులోతు నెహ్రూ, బోడ శ్రీను, పానుగంటి కృష్ణమూర్తి, రాంబాబు, కల్లెపు శ్రీను పాల్గొన్నారు. అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో దైద భద్రయ్య కిన్నెర మల్లయ్య, మిర్యాల లక్ష్మయ్య, బొల్లెం ఉప్పలయ్య కాట్యాల వీరన్న, కలగూర నాగరాజు, బీజేపీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు ఎస్వీన్ రాజు, బుక్క శంకర్‌రావు, రేషబోయిన కృష్ణ, దేవికరుణాకర్ పాల్గొన్నారు.



అప్పరాజుపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పిస్తున్న మానుకోట ఎంపీ కవిత

నేరడలో ఎంపీపీ గుగులోతు పద్మావతి, బీఆర్ఎస్ నాయకులు గుగులోతు రవి, గుండోజు శ్రీనివాస్, నీరుడు సామేల్, తట్టుపల్లిలో విద్యుత్‌శాఖ డీఈ విజయ్, జంగం రవి, చంద శ్రీనివాస్, సీహెచ్.శ్రీనివాస్, పొరెడ్డి రాంరెడ్డి, సహదేవ్, సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, తురక రమేష్, బుడమ వెంకన్న, కన్నె వెంకన్న, నిలుగొండ నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

- కేసముద్రం మండలంలోని వివిధ గ్రామాల్లో టీపీసీసీ సభ్యులు గుగులోతు దస్రునాయక్, మందుల కృష్ణమూర్తి, వల్లందాసు రవి, కంటిపూడి అరుణ్‌కుమార్, పోలెపాక నాగరాజు, అయూబ్‌ఖాన్, తరాల వీరేష్‌యాదవ్, వెల్పుల యాకయ్య, మిట్టగడుపుల మహేందర్, సోమారపు మదార్, జల్లె యాకాంబ్రం, మురగుండ్ల యాదగిరి, అనంతరాములు, గండి శ్రీనివాస్, చింతనూరి వెంకన్నవేడుకల్లో పాల్గొన్నారు.
- ఇనుగుర్తిలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాలను బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజకీయ నాయకులు, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఇనుగుర్తిలో అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాలను అందజేస్తున్న గాయత్రి గ్రానైట్స్ అధినేత కిషన్

జాతిని జాగృతి పరిచిన మహనీయుడు అంబేద్కర్

- ప్రజాకవి, రచయిత జయరాజ్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 14 : యావత్ భారతజాతిని జాగృతి పరిచిన మహనీయుడు డాక్టర్ బీంరావ్‌రాంజీ అంబేద్కర్ అని ప్రజాకవి, రచయిత, ప్రకృతి ప్రేమికుడు, కాళోజీ అవార్డుగ్రహీత గొడిశాల జయరాజ్ కొనియాడారు. గుమ్ముడూరులోని అంబేద్కర్ భవనంలో ఆదివారం ఎంబీబీఎస్ పూర్తిచేసి డాక్టర్ పట్టాను పొందిన దళిత వైద్యవిద్యార్థినుల అభినందన సభను వార్డు కౌన్సిలర్ సూర్నపు సోమయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దళిత, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి, హక్కుల సాధనకోసం భారత రాజ్యాంగాన్ని నిర్మించి అందించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో అంబరీష మాట్లాడుతూ ఆహర్నిషలు కష్టపడి వైద్యవిద్యను పూర్తి చేసి వైద్యవృత్తిలోకి అడుగుపెడుతున్న విద్యార్థినులు సామాజిక దృక్పదంతో విధులు నిర్వహిస్తూ వైద్యరంగంలో రాణించాలని సూచించారు. టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు, నలంద విద్యాసంస్థల చైర్మన్ డోలి సత్యనారాయణ మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్ల ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న ఫలాలు అని పేర్కొన్నారు. అనంతరం ఎంబీబీఎస్ పట్టాపొందిన వైద్యవిద్యార్థినులు పెరుమాళ్ల అనిత, బేతమల్ల వెన్నెల, గులగట్టు ప్రయార్ష, సోమారపు గాయత్రి, చింతల అనితలను ఘనంగా సన్మానించారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కవయిత్రి డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మ, పార్నంది రామయ్య, యాకయ్య, సూర్నపు ముత్తయ్య, రావుల రాజు, కుమార్, చాగంటి భాగ్యమ్మ, నీరుడు జంపయ్య, సమ్మయ్య, బేతమల్ల విజయ, సూర్నపు సావిత్ర, గుమ్మడి వీరన్న, శ్రవణ్‌కుమార్, రాజు, రామ్మూర్తి, మురళీ, నీలేష్‌రాయ్, సునీత, ఉమా, వాణి పాల్గొన్నారు.



అభినందన సభలో మాట్లాడుతున్న జయరాజ్

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం

- కేంద్ర మాజీమంత్రి పోరిక బలరాంనాయక్




మాట్లాడుతున్న పోరిక బలరాంనాయక్

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 14 : కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని కేంద్ర మాజీమంత్రి, కాంగ్రెస్ పార్టీ మానుకోట ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ అన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కార్పొరేట్ శక్తుల పక్షాన నిలిచి పేదలను విస్మరించిందని, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే నిరుపేదలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నూనావత్ రాధ, మహ్మద్ ఖలీల్, చుక్కల ఉదయ్‌చందర్, బానోత్ ప్రసాద్, నీరుటి లక్ష్మీనారాయణ, ఎడ్ల రమేష్, బోడ రవినాయక్, నీరుటి సురేష్‌నాయుడు, వెంకట్‌రెడ్డి, నారోజు సత్యమనోరమ పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాల ప్రారంభం

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 14 : జిల్లా కేంద్రంలో ఈనెల 14వ తేదీ నుంచి 20 వరకు కొనసాగనున్న అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో తొలిరోజు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అగ్నిమాపక సిబ్బందికి నివాళులర్పించారు. ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్‌ఫైర్ ఆఫీసర్ డి.నాగేశ్వర్‌రావు, బి.క్రిష్ణ, కె.రవీందర్, పి.ప్రసన్నాకుమార్, జె.బాలు, రవి, వెంకన్న, వెంకటయ్య పాల్గొన్నారు.

మైనార్టీ సెల్ పార్లమెంటరీ నియోజకవర్గ కోన్‌చార్జిగా ఖలీల్



మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 14 : కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ కో-ఇన్‌చార్జీగా మానుకోట పట్టణానికి చెందిన మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఖలీల్ అహ్మద్ నియామకమయ్యారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలోమహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అబ్జర్వర్, కోఇన్‌చార్జితో పాటు ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు అబ్జర్వర్లను నియమిస్తూ ఏఐసీసీ అనుబంధ మైనార్టీ సెల్ వైస్‌చైర్మన్ ఫర్హాన్ అజ్మీ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్లమెంటరీ నియోజకవర్గ అబ్జర్వర్‌గా భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన మహమూద్‌ఖాన్‌నియామకమయ్యారు.ములుగు అసెంబ్లీ నియోజకవర్గ అబ్జర్వర్‌గా షేక్‌ఖలీల్, పినపాకు మహ్మద్ బషీరుద్దీన్, ఇల్లందుకు షేక్. గౌస్, భద్రాచలంకు మహ్మద్ సింధా, డోర్నకల్‌కు అఫ్జల్, మహబూబాబాద్‌కు యాకూబ్ పాషా, నర్సంపేటకు అబ్దుల్ ఖయ్యూం నియామకమయ్యారు.

'కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి'

పెద్దవంగర, ఏప్రిల్ 14 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రంగు మురళిగౌడ్ అన్నారు. అదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ముత్యాల పూర్ణచందర్, పొడిశెట్టి సైదులు, సతీష్, శ్రీరాం జగదీష్‌బాబు, దాసరి శ్రీనివాస్, సీతారామ్‌నాయక్, వేణు పాల్గొన్నారు.

'న్యాయవ్యవస్థే ప్రజలకు సేవ చేస్తోంది'

తొర్రూరు, ఏప్రిల్14 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం న్యాయ వ్యవస్థ నేడు అన్నివిధాలుగా సేవ చేస్తోందని తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి, చైర్మన్ మండల న్యాయసేవ అధికారి మట్ట సరిత అన్నారు. ఆదివారం అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా తొర్రూరు కోర్టు ఆవరణలో అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆమె మాట్లాడారు. న్యాయవాది బార్ అసోసియేషన్ సెక్రెటరీ గణపురం రామకృష్ణ రాజ్యాంగ పీఠిక అంబేద్కర్ ఎవరు అనే పుస్తకాన్ని జడ్జి చేతుల మీదుగా న్యాయవాదులకు బహూకరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్ రాజు, సెక్రెటరీ రామకృష్ణ, సభ్యులు శ్రీశైలం, సైదులు, విజయ, వెంకన్న, మహేష్, ఐలోని, వెంకటేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఆర్టీసీ ఉద్యోగి



కాంగ్రెస్ పార్టీలో చేరిన రాములు

తొర్రూరు, ఏప్రిల్ 14 : కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ఆధ్వర్యంలో చెర్లపాలెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆదివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరితో పాటు అదే గ్రామానికి చెందిన ధర్మారపు రాములు (ఆర్టీసీ ఉద్యోగి) తొర్రూరు డిపోలో సూపర్ వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరి పార్టీ కండువా కప్పుకున్నాడు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో డీఎం పద్మావతిని వివరణ కోరగా- ఫొటోలు సోషల్ మీడియాలో చూశామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలుంటాయని తెలిపారు.

సొంతగూటికి రాజయ్య

- కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే



కేసీఆర్‌తో మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్ (జనగామజిల్లా), ఏప్రిల్ 14 : స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఎట్టకేలకు సొంతగూటికి చేరుకున్నారు. మాజీ సీఎం కేసీఆర్ సమక్షంలో ఆదివారం సిద్దిపేట జిల్లా ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో పార్టీ కండువా కప్పుకున్నారు. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా ఉన్న సమయంలో రాజయ్య అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనకు టికెట్ రానందుకు నిరసనగా ఫిబ్రవరి 3న బీఆర్ఎస్ పార్టీకి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. వారం రోజుల్లో కాంగ్రెస్ పార్టీలో చేరుతానని ప్రకటించారు. ఈ నేపథ్యంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర అనుచరులు రాజయ్యను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకో వద్దు అంటూ పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. నియోజకవర్గ మహిళా నాయ కులు ఏకంగా గాంధీభవన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అధిష్ఠానానికి వినతిప త్రాలు అందించారు. అయినప్పటికీ రాజయ్య సీఎం రేవంత్ రెడ్డిని, ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్కను, పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేను, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని, దామోదర రాజ నర్సింహను కలిసి పార్టీ చేరిక అంశమై చర్చించారు. అయినా రాజయ్యకు కాంగ్రెస్ పార్టీ నుంచి ఆహ్వానం రాలేదు. ఈ క్రమంలో చివరికి కేసీఆర్ హనుమకొండ జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్ పేరును ప్రకటించడంతో రాజయ్య ఎర్రవెల్లిలో కేసీఆర్‌ను కలువకుండానే వెను దిరిగారు. చివరకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజయ్య ఆదివారం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

'దాడులు చేయడం సరికాదు'

తొర్రూరు, ఏప్రిల్ 14 : కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికార దాహంతో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై దాడులు చేయడం సరికాదని రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఆదివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ఓప్రైవేటు ఆస్పత్రిలో మడిపెల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఎమ్డీ.అక్బర్ కాంగ్రెస్ నాయకుల దాడిలో గాయపడి చికిత్స పొందుతుండగా పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్త అక్బర్ చెరువు మట్టిని తన పొలంలో పోసుకుంటుంటే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సోమిరెడ్డి, వెంకటేశ్వర్లు ప్రభుత్వ మొరంను తీసుకపోవాలంటే కాంగ్రెస్ పార్టీలో చేరాలని భౌతికదాడులు చేయడం సరికాదన్నారు. జడ్పీటీసీ శ్రీనివాస్, కిషోర్‌రెడ్డి, సీతారాములు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చెరువులోకి వెళ్లిన ఎడ్లబండి.. ఆవు మృతి

కేసముద్రం, ఏప్రిల్ 14 : పశువులకు నీళ్ల తాపిద్దామని ఎడ్లబండితో చెరువులోకి వెళ్లగా ప్రమాదవశాత్తు ఓ ఆవు మృతి చెందిన ఘటన కేసముద్రం మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. తాళ్లపూసపల్లి గ్రామానికి చెందిన పుణ్యపుర్తి ఐలయ్య చెలకవద్ద పని ముగించుకొని ఇంటికి వెళ్తున్న క్రమంలో ఎడ్లకు నీళ్లు తాపిద్దామని మార్గమధ్యలోని చెరువులోకి ఎడ్లబండిని తీసు కెళ్లాడు. అయితే చెరువులోని నీటి కింది భాగంలో గల గుంతల్లో పమాదవ శాత్తు ఎడ్లబండి కూరుకపోవడంతో ఊపిరి ఆడక ఆవు మృతి చెందింది. కాగా, ఈ ప్రమాద సమయంలో రోడ్డు వెంబడి వెళ్తున్న విజయ్ అనేవ్యక్తి చెరువులోకి వెళ్లి నీటిలో ముని గిన ఐలయ్యతో పాటు అతని మనవడుని బయటకు లాగిరక్షించాడు. ఈ క్రమంలోనే బండికి ఉన్న తాడును సైతం కోసి రెండుఎడ్లను కూడా రక్షించాడు. కానీ, ఇంత శ్రమించినా ఆవును మాత్రం కాపాడలేక పోయాడు. నీటిలో ఊపిరి ఆడక ఆవు మృతి చెందింది. విజయ్ సాహసోపేతంగా చెరువులోకి వెళ్లి మనుషులను, ఎడ్లను రక్షించటాన్ని పలువురు అభినందిస్తున్నారు.

పోచమ్మకు పూజలు

గూడూరు, ఏప్రిల్ 14 : గూడూరు సనాతన శివాలయంకు అనుబంధంగా ఉన్న శ్రీశ్రీబంతిపోచమ్మ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం వేద పండితులు భాను ప్రకాష్, సందీప్‌పాండే, గణపతిపూజ, పుణ్యాహవచనజ ఆఖండ ప్రజ్వలన, అంకురార్పణ, గ్రామదేవతకు నవనీతాది వాసజ పంచామృతాభిషేకజ ప్రతీ ఇంటి నుంచి తీసుకువచ్చి జలాభిషేకం నిర్వహించారు. హోమం, అమ్మ వారికి బోనాల సమర్పణ కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఏపూరు రవీందర్‌రెడ్డి, బీరం శ్రీపాల్‌రెడ్డి, గాదె సాగర్, పెసరి శివ, పానుగంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై పోరాడుతా

కురవి, ఏప్రిల్ 14 : తన రాజకీయ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు అధిగమించానని, బతికినంతకాలం ప్రజలకు అందుబాటులో సేవచేస్తానని జడ్పీటీసీ బండి వెంకట్‌రెడ్డి అన్నారు. కురవిలో బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు, లేనప్పుడు అన్నివేళల కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుకున్నానని వెల్లడించారు. బీఆర్ఎస్ నాయకులు ఐలు నరహరి, బోడ శ్రీనివాస్, జంగిలి హరిప్రసాద్, బాదె నాగయ్య, గుగులోతు నెహ్రూనాయక్ పాల్గొన్నారు.

తోటి వ్యాపారికి ఆర్థిక సహాయం

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్14 : రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ తోటి వ్యాపారికి మహబూబాబాద్ రెడిమెడ్ డ్రెస్సెస్ అసోసియేషన్ చేయూత నందించింది. పట్టణానికి చెందిన శ్రీలక్ష్మీగణపతి డ్రెస్సెస్ యజమాని రాజు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న రెడిమెడ్ డ్రెస్సెస్ బాధ్యులు తల కొంత వేసుకుని రూ.40వేలు పోగు చేశారు. సదరు పైకాన్ని రాజు సొంత గ్రామం గూడూరు మండలం కొమ్మలవంచలో ఆదివారం రెడిమెడ్ డ్రెస్సెస్ అసోసియేషన్ బాధ్యులు ఆయనకు అందజేశారు. బోనగిరి గిరిధర్ గుప్తా, పొద్దుటూరి సత్యనారాయణ, వంగ యోగి, పయ్యావుల కిరణ్, సోమ కోటి, వేమిశెట్టి కిరణ్‌కుమార్, ఆకుల సోమయ్య, పయ్యావుల శరత్ పాల్గొన్నారు.